www.aksharavelugu.com

# అక్షర వెలుగు

జనం కోసం - మన అక్షరం

తెలుగు దిన పత్రిక

బుధ వారం

01. 06. 2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

సంపుటి - 01, సంచిక-92

పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :

గోసుకొండ పృధ్విరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విలేకరులుగా పనిచేయడానికి ఆహ్వానిస్తున్నాము. సామాజిక దృక్పథం, అవినీతి, అక్రమాలపై అక్షర గళాన్ని వినిపించే దమ్మున్న విలేకరులు 'అక్షర వెలుగు' తెలుగు దిన పత్రికలో పని చేయడానికి ఈ క్రింది మేయిల్ అడ్రస్‌కు వివరాలను పంపండి

Mail: aksharavelugudaily@gmail.com

8985893382

## ప్రతి రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు






- ప్రజా సంక్షేమానికి ఇది ఎంతో అవసరం
- అభివృద్ధికి ఆటంకం లేకుండా పోతుంది
- కిసాన్ సమ్మాన్ నిధి లబ్దిదారుల సమావేశంలో ప్రధాని మోడీ
- మోడీ రాకతో అభివృద్ధి పరుగులు తీస్తోందన్న మంత్రి కిషన్ రెడ్డి

రంగారెడ్డి,మే31(ఆర్ఎన్ఎ): 'ప్రతి రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఉండాల్సిందే..'అని ప్రధాని మోడీ ఉద్ఘాటించారు. సేవా, సుపరిపాలన, పేదల సంక్షేమమే.. తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. దేశాన్ని సురక్షితంగా ఉంచడమే ధ్యేయమని తెలిపారు. ప్రతి రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఉండాల్సిందేనని ఉద్ఘాటించారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్‌లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి లబ్దిదారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా రైతులతో మాట్లాడారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, క్రిడా డైరెక్టర్ వీకే. సింగ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. రైతుల సమస్యలతో పాటు కేంద్ర పథకాలపై అభిప్రాయాలు రైతులను మోదీ అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని ప్రధాని విడుదల చేసి.. రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఉజ్వల యోజన పథకం ద్వారా ప్రతి ఇంటికి ఉచిత గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. దేశాన్ని సురక్షితంగా ఉంచడామే ధ్యేయం. సర్జికల్ స్ట్రైక్ చేయడం

2వ

## యూపి నుంచి రాజ్యసభకు డాక్టర్ లక్ష్మణ్

- బిజెపి కేంద్ర కమిటీ నిర్ణయం
- లక్ష్మణ్ ఇంటివద్దకార్యకర్తల సందడి
- ఉదయమే లక్నోకు వెళ్లిన లక్ష్మణ్



హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ):రాష్ట్ర బీజేపీ సీనియర్ నేత, ఓబీసీ మోర్చా జాతీయాధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ను రాజ్యసభ అభ్యర్థిగా బీజేపీ హైకమాండ్ నిర్ణయించింది. ఉత్తరప్రదేశ్ నుంచి ఆయన రాజ్యసభ ఎన్నికల బరిలో నిలుస్తారని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రకటించింది. రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించడంతో లక్ష్మణ్ నివాసం సందడిగా మారింది.

2వ

## ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

- పోతిరెడ్డిపేటలో ధర్నాకు దిగిన రైతాంగం
- రైతుల ధర్నాకు మద్దతు తెలిపిన రఘునందన్ రావు
- చేతులెత్తేసిన ప్రభుత్వం అంటూ విమర్శలు



**సిద్దిపేట,మే31(ఆర్ఎన్ఎ):** 75 శాతం మంది రైతులు ఇంకా కల్లాల్లోనే ఉన్నారని ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో మాటలు తప్ప చేతలు లేవన్నారు. సిద్దిపేట దుబ్బాక మండలం పోతరెడ్డిపేటలోని రోడ్డుపై రైతులు ధర్నాకు దిగారు. ధాన్యం కొనుగోలులో ఆలస్యం జరుగుతుందంటూ నిరసనకు దిగారు. రైతుల ధర్నాకు మద్ధతుగా రఘునందన్ రావు రోడ్డుపై బైఠాయించారు. నెల రోజులుగా కొనుగోలు విషయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తన నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారాయన. ప్రస్తుతం నెలకొన్న సమస్యలు సీఎం కేసీఆర్ కు, మంత్రి వర్గానికి పట్టవని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోహిణి కార్తె సమీపిస్తోందని, ఈ క్రమంలో తొందరలోనే వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ చెబుతోందనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి జూన్ 10 కల్లా వడ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తాము చేతులెత్తి పార్టీల కతీతంగా

2వ

## గ్రూప్-1 పోస్టులకు ముగిసిన గడువు

**చివరి రోజు భారీగా దరఖాస్తులు రాక**

హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ): టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-1 పోస్టులకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం 31న చివరి రోజు కావడంతో.. దరఖాస్తులు అధికంగా వస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ అధికారులు వెల్లడించారు. మంగళవారం ఉదయం నుంచి గంటకు 4 వేల చొప్పున దరఖాస్తులను సమర్పిస్తున్నారు. సాయంత్రం 4 గంటల వరకు 3,21,704 దరఖాస్తులు వచ్చాయ న్నారు. ఇవాళ రాత్రి 12 గంటలకు దరఖాస్తుల గడువు ముగియనుంది. సోమవారం వరకు 2,94,644 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఇవాళ ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు 27,060 మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్ధరాత్రి 12 గంటల వరకు ఈ సంఖ్య 40 వేలకు పైగా చేరుకునే అవకాశం ఉంది. మొత్తంగా 503 గ్రూప్-1 పోస్టులకు 3 లక్షల 50 వేల వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.

## మరోమారు నగర శివారుప్లాట్లకు వేలం

**నోటిఫికేషన్ విడుదల చేసిన హెచ్ఎండిఎ**

హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ): మరోసారి భూముల వేలానికి హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ హెచ్ఎండీఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని మేడ్చల్ జిల్లా బహదూర్ పల్లి, రంగారెడ్డి జిల్లా తొర్రుర్, తుర్కయాంజల్ లేఅవుట్లలోని ప్లాట్లను అమ్మకానికి పెట్టినట్లు ప్రకటించింది. బహదూర్ పల్లిలో 51 ప్లాట్లు, తొర్రుర్ లో 148 ప్లాట్లు, తుర్కయాంజల్ లో 34 ప్లాట్లకు వేలం వేయనున్నట్లు వెల్లడించింది. గతంలో అమ్ముడుపోని ప్లాట్లతో పాటు మరికొన్ని ప్లాట్లకు ఈసారి వేలం నిర్వహిస్తున్నామని హెచ్ఎండీఏ స్పష్టం చేసింది.వేలంలో పాల్గొనదల్చిన వారు జూన్ 28న సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపింది.వేలంలో పాల్గొనేవారు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ) చేయడానికి జూన్ 29 వరకు గడువు ఉందని పేర్కొంది. ప్లాట్లకు సంబంధించిన ఆన్ లైన్ వేలం జూన్ 30న ఉంటుందని తెలిపింది. బహదూర్ పల్లిలోని ప్లాట్లకు ఒక్కో గజానికి రూ.25వేలు, తొర్రుర్ లో గజానికి రూ.20వేల ధరను నిర్ధారించినట్లు హెచ్ఎండీఏ వివరించింది. తుర్క యాంజల్ లో

2వ

## మట్టి వినాయక విగ్రహాలనే ఉపయోగించాలి

- వినాయకచవితికి ఇప్పటినుంచే సన్నద్ధత
- తయారీదారులకు ఈ మేరకు చైతన్యం చేయాలి
- హైకోర్టు ఆదేశాల మేరకు కఠినంగా వ్యవహరించాల్సిందే
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎస్ సోమేశ్ కుమార్ ఆదేశాలు



హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ): వచ్చే వినాయక చవితికి ఇప్పటి నుంచే సిద్ధం కావాలని, నగరంలో కాలుష్య కారక గణెళిష్ విగ్రహాలను ఉపయోగించవద్దని సీఎస్ సోమేశ్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర హైకోర్ట్ ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, ఈ నేపథ్యంలో మట్టి వినాయకుల విగ్రహాలు వినియోగించే విధంగా నగర వాసులను చైతన్య పర్చాలని పేర్కొన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, సింథటిక్ కలర్లు, పర్యావరణ

2వ

## కెఎఫ్‌సి చికెన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు

- ఫిర్యదు చేసిన సామాజికవేత్త
- మరో ఘటనలో మిల్క్‌షేక్‌లో బల్లి
- రిలయన్స్ మార్ట్ మేనేజర్ అరెస్ట్





హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ): జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ కెఎఫ్‌సి ఔట్‌లెట్‌లో చికెన్ ఐటమ్‌లో ప్లాస్టిక్ పదార్థాలు కలుపుతున్నారని ప్రగతినగర్‌కు చెందిన సామాజికవేత్త సాయితేజ ట్విటర్ ద్వారా జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సాయితేజ ఆదివారం మధ్యాహ్నం రూ. 433 చెల్లించి స్విగ్గీ ద్వారా మింగిల్ బకెట్ చికెన్ ఐటమ్ ఆర్డర్ చేశాడు. ఇంటికి వచ్చాక చికెన్ తింటుండగా సాగుతున్నట్టు అనిపించింది. అందులో ప్లాస్టిక్ కలిపినట్టు అనుమానించి ఫొటోలు, వీడియో తీసి కేఎఫ్‌సీతోపాటు స్విగ్గీ , జీహెచ్ఎంసీ అధికారులకు వెబ్‌సైట్, ట్విటర్ ద్వారా ఫిర్యాదు చేశాడు. డీసీ ఆదేశాలతో సోమవారం

2వ

## గ్రామ సర్పంచ్‌లకు అండగా ఉంటాం

- వారికోసం బిజెపి మౌనదీక్ష చేస్తుంది
- నిధులు ఇవ్వకుండా గ్రామాలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం
- సర్పంచ్‌లకు లేఖ రాసిన బండి సంజయ్



హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ): గ్రామ సర్పంచ్‌లకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ లేఖ రాశారు. 73, 74 రాజ్యాంగ అధికరణలకు టీఆర్ఎస్ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. గ్రామాల స్వశక్తితో అభివృద్ధి పథంలో నడవాలన్నదే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ లక్ష్యంమన్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం గ్రామ సర్పంచ్‌లు చేసే ఆందోళనలకు బీజేపీ సంపూర్ణ

2వ

## ప్రపంచవ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ): ప్రపంచ వ్యాప్తంగా జూన్ 2 న తెలంగాణ ఆవిర్భవ దినోత్సవాలను ఎన్నారైలు ఘనంగా జరుపుకోవాలని టీఆర్ఎస్ ఎన్నారై కో ఆర్డినేటర్

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నల్లగొండ,మే31(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ బడులను బాగు చేసేందుకు సీఎం కేసీఆర్ మన ఊరు- మన బడి అనే గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించారని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ అన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా పీఏపల్లి మండలం అజ్మాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రూ. 11. 29లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతాయన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో పీఏపల్లి మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో తగ్గిన రైతు ఆత్మహత్యలు



- బీజేపీ, కాంగ్రెస్‌లకు అధికారమిస్తే మళ్లీ చీకటిరోజులు
- సాగు సన్నాహక సమావేశంలో మంత్రి హరీష్ రావు

2వ

గజ్వేల్,మే31(ఆర్ఎన్ఎ): దేశంలో అత్యధింగా రైతు ఆత్మహత్యలు తగ్గించిన రాష్ట్రం తెలంగాణ అని కేంద్రం ప్రకటించినట్లు మంత్రి హరీష్ రావు చెప్పారు. రైతు అనుకూల విధానాల వల్లనే ఇది సాధ్యమయ్యిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు అధికారంలోకి వస్తే మళ్లీ చీకరోజులు వస్తాయని మంత్రి విమర్శించారు. తెలంగాణలో సర్కారు ఉద్యోగికి ఎంత డిమాండ్ ఉందో రైతుకు అంతే డిమాండ్ వచ్చిందని మంత్రి హరీష్ రావు అన్నారు. గతంలో ఎండాకాలం వచ్చిందంటే రైతుల ఆత్మహత్యలు, ఆందోళనలు ఉండేవి కానీ టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితిలో మార్పు వచ్చిందన్నారు. 24 గంటల కరెంట్,సాగు నీళ్లు, రైతు బంధు,రైతు బీమా వంటి ఎన్నో పథకాలు రైతులకు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. గజ్వేల్ మహతి ఆడిటోరియంలో వానాకాలం సాగు సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కొందరు రైతుబీమాను రద్దు చేయాలని పిచ్చివ్యాఖ్యలు చేస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. రైతుబీమా అంటే రైతు ఆత్మహత్యలుగా చిత్రీకరిస్తున్నారని కానీ రైతు ఏ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాన్ని ఆదుకుంటున్నామన్నారు. వరికంటే ఆయిల్ పామ్ సాగు వల్ల మూడురెట్ల లాభం వస్తుందని..ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని

## సివిల్స్ టాపర్స్‌కు మంత్రి కెటిఆర్ అభినందనలు

**వీరంతా దేశాన్నిముందుకు నడపాలని ఆకాంక్ష**



హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ): సివిల్స్ 2021లో ర్యాంకులు సాధించిన వారిని మంత్రి కేటీఆర్ అభినందించారు. సివిల్స్‌లో అసాధారణ ప్రతిభ కనబరిచిన టాప్ ముగ్గురు అమ్మాయిలకు మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా బెస్ట్ విషెస్ చెప్పారు. తెలంగాణ రాష్ట్రం నుంచి సివిల్స్‌కు ఎంపికైన ర్యాంకర్లను కూడా మంత్రి కేటీఆర్ మెచ్చుకున్నారు. మీ ప్రతిభ, ప్రయత్నాలతో ఈ దేశాన్ని మీరు ముందు ఉండి నడుపుతారని ఆశిస్తున్నట్లు మంత్రి కేటీఆర్ తన ట్విట్టర్‌లో అభిప్రాయపడ్డారు. తన ట్విట్టర్‌లో ఆయన స్పందిస్తూ.. సివిల్స్ ఫలితాలతో సంకల్పం, పట్టుదలకు చెందిన కొన్ని అద్భుతమైన కథలు వెలుగులోకి వచ్చినట్లు మంత్రి కేటీఆర్ అన్నారు. సివిల్స్ 2021 ర్యాంకర్లను సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సారి టాప్ మూడు స్థానాలను అమ్మాయిలే కైవసం చేసుకున్నారు. టాపర్‌గా శ్రుతి శర్మ నిలిచింది. ఇక రెండవ, మూడవ ర్యాంక్‌లను అంకితా అగర్వాల్, గామిని సింగ్లాలు సొంతం చేసుకున్నారు. తెలుగువారిలో యశ్వంత్‌రెడ్డికి 15వ ర్యాంక్, సంజన సింహకు 37వ ర్యాంక్ వచ్చింది. భూపాలపల్లికి చెందిన యువకుడు నరేశ్‌కు 117వ ర్యాంక్ రావడం విశేషం. నిజామాబాద్ యువతి స్నేహకు 136వ ర్యాంకు, సూర్యాపేటకు చెందిన చైతన్యరెడ్డికి 161వ ర్యాంకులు వచ్చాయి.

## సంపాదకీయం

# దుబారా పథకాలను సమీక్షించాల్సిందే !

తెలంగాణ ఏర్పడ్డ తరవాత గత ఎనిమిదేళ్ల కాలం పరిశీలిస్తే సిఎం కెసిఆర్ కీలక నిర్ణయాలు తీసుకుని ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశాయనే చెప్పాలి. ప్రధానంగా సాగునీటి రంగంలోనూ, విద్యుత్ రంగంలో నూ కీలక నిర్ణయాలు తీసుకోవడంతో మంచి ఫలితాలు వచ్చాయి. అనేక సమస్యలు వెన్నాడుతున్నా.. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డ తరవాత కొన్ని సమస్యలకైనా పరిష్కారం దక్కింది. ఇంకా అనేక సమస్యలు ఉన్నాయి. అయితే ఆర్థిక పరమైన నిర్ణయాల్లో విచ్చలవిడి కారణంగా రాష్ట్రంలో మరిన్ని సమస్యలకు కారణం అవుతోంది. ఈ సమస్యలపై కెసిఆర్ దృష్టి సారించాలి. ఇక రైతు రుణమాఫీ అన్నది కూడా నిరంతరాయంగా కొనసాగించడం సరికాదు. అలాగే ఉచిత విద్యుత్‌పైనా నియంత్రణ ఉండాలి. మోటర్లకు మీటర్లు పెట్టి అంచనా వేయాలి. అలాగే వ్యవసాయానికి నిజంగానే ఎంత కరెంట్ అవసరమో అంతే ఉచితంగా ఇవ్వాలి. దుబారాకు కళ్లెం వేయకపోతే దాని ప్రభావం కూడా తీవ్రంగా ఉంటుంది. ఎపిలో శ్రీకాకుళం జిల్లాలో మీటర్లు పెట్టడం మంచిపరిణామం. దీంతో 30 శాతం విద్యుత్ ఆదా అయ్యింది. ఈ విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈ తరహా విధానం అమలు చేయడంతో మంచి ఫలితాలు రాబట్టారు. మరిన్నిజిల్లాల్లో మీటర్లు పెట్టడం కోసం ప్రయత్నాలు సాగు తున్నాయి. ఉచిత విద్యుత్‌కు విఘాతం కలిగించకుండా మీటర్లు పెట్టి లెక్కించుకోవడం అన్నది అకౌంట బులిటీని తెలియచేస్తుంది. ఇదే తరహాలో తెలంగాణ లో మీటర్లు పెట్టి ఏ రైతులకు ఎంత పొలం ఉంది.. వారు ఏ పంటలు వేస్తున్నారో లెక్క తీయాలి. అన్నింటికి మించి పాతబస్తీలో అక్రంగా వాడుతున్న కరెంట్‌పై కన్నేయాలి. దీనిని అరికట్టకుంటే బిల్లులు కట్టేవారిపైనే భారం పడుతోంది. ఖజనాకు భారంగాను, ప్రజలకు భారంగానూ మారుతున్న పథకాలను సమీక్షించు కోవడంలో తప్పులేదు. ఇది కేంద్రం కుట్ర అన్న వాదనలో నిజం లేదు. నియంత్రణ లేకుంటే ఉచిత పథకాలు మెడకు చుట్టుకుంటాయి. శ్రీలంక సంక్షోభంలో మనం ఈ విషయాలను గుర్తించాం. ఇదే సందర్భంలో దుబారాను అరికట్టకపోతే మరింత భారం తప్పదు. ఇది ఉభయ తెలుగు రాష్ట్రాలకు వర్తిస్తుంది. ఇప్పటికే జీతాలకు,పెన్షన్లకు కష్టంగా మారింది. ఈ క్రమంలో పథకాలను సమీక్షించుకుని కఠిన నిర్ణయాలతో ముందుకు సాగాలి. జూన్ 2న అవతరణ దినోత్సవాలు జరుపు కుంటున్న వేళ కఠిన నిర్ణయలతో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ముందదుకు సాగాలి. వివిధ రంగాల్లో గట్టి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా తెలంగాణ పురోగమనంలో కీలక అడుగులు పడ్డాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం ఆచరించిన, అనుసరించిన, అవలంబించిన అన్ని విధానాలను ప్రజలు గమని స్తున్నారు. ఈ పనులన్నీ వారు కోరుకుంటున్నవే. కెసిఆర్‌పై ప్రజలు విశ్వాసాన్ని ఉంచి నందుకు అందుకు తగ్గట్లుగా హామీలను నెరవేర్చే బాధ్యతలను చిత్తశుద్ధితో అమలు చేయాలి. కేంద్రం అండ లేకున్నా అద్భుత ప్రగతి సాధిస్తున్నామని నేతలు పేర్కొంటున్నారు. కేంద్రంలో ఇప్పుడు అధికారంలోని బీజేపీ ప్రభుత్వం మనకు అదనంగా ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని చెప్పడం ద్వారా బిజెపి తీరును దుయ్యబడు తున్నారు.ప్రధానంగా జిల్లాల విభజన, కొత్త జిల్లాల ఏర్పాటు చారిత్రక ఘట్టంగా పేర్కొనాలి. స్వాతంత్ర్య వచ్చాక ఇంతటి కీలక నిర్ణయాలు తీసుకున్న దాఖలాలు లేవు. 10 జిల్లాలు ఉన్న తెలంగాణను పాలనా వికేంద్రీకరణలో భాగంగా 33 జిల్లాలో చేశారు. దేశంలో ఇంతటి అరుదైన నిర్ణయం తెలంగాణలో మాత్రమే జరిగింది.

ఆశలను కల్పించడం వేరు.. వాటిని సాకారం చేయడం వేరు. తెలంగాణ కలను సాకారం చేసిన వ్యక్తిగా ధీరోదాత్త నాయకుడిగా చరిత్ర లో చిరస్థాయిగా నిలిచిపోతారు. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఒక్కో హామీని సాకారం చేసే దిశగా సిఎం కెసిఆర్ అడుగులు వేస్తున్నారు. ప్రజలు భాగస్వాములైతే తెలంగాణ పురోభివృద్ధిలో కీలకం కానుంది. ఇక మరో విశేషమేమంటే సమైక్య రాష్ట్రం అవసరాలకు అనుగుణంగా రూపొందించిన అనేక పథకాలను,చట్టలాను మార్పు చేసుకుంటే తెలంగాణ అస్తిత్వానికి అనుగుణంగా సాగడం అన్నది కెసిఆర్ తీసుకున్న అతిపెద్ద నిర్ణయంగా చెప్పుకోవాలి. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ముఖ్యమైనవి. ఇకపోతే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో కూడా తెలంగాణ ఓ వెలుగు వెలుగుతోంది. దేశానికి ఈ పథకం ఆదర్శం కాబోతున్నది. తన దత్తత గ్రామాలైన ఎర్రవల్లి, నర్సన్నపటల రూపు రేఖలను మార్చి ఇళ్లకు కొత్త అర్థం చెప్పారు. చెప్పడమే కాదు చేసి చూపారు. పేదలు కూడా గౌరవంగా బతికేలా చేశారు. రెండు పడకగదుల ఇళ్లు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందిలో కొత్త ఆశలు చిగురింపజేశాయి. తమకూ అటువంటి ఇళ్లు రాబోతున్నయన్న ఆనందంలో ఉన్నారు. రానున్న రెండేళ్లలో ఈ కలను సాకారం చేస్తామన్న హామీ ఇప్పుడు పేదలకు సంజీవినిగా మారింది. ఉద్యోగాల భర్తీ పక్రియనూ సర్కారు వేగవంతం చేసింది. తెలంగాణ కోటి రతనాల వీణగా భాసిల్లాలంటే అందుకు కావలసిన సంకల్పబలం సమకూర్చుకున్నారు. సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ఇలా చెప్పుకుంటూ పోతే తెలంగాణలో గతంలో మునుపెన్నడూ జరగని పనులు జరిగాయని చెప్పుకోవాలి. ఇంటింటికీ స్వచ్ఛమైన మంచినీటిని అందజేసే మిషన్ భగీరథ, చెరువులను పునరుద్ధరించి వాటిలో పుష్కలంగా నీళ్లు ఉండేటట్టు చూసే మిషన్ కాకతీయ, రెండు పడక గదుల ఇళ్లు, 36లక్షల మందికి ఆసరా పథకం కింద పెన్షన్లు అందజేత వంటి వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థంగా చేపట్టింది. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లాంటివి కూడా ఎన్నో ఉన్నాయి. అన్నింటి కి మించి హరితహారం కార్యక్రమం తెలంగాణకు పెద్ద అసెట్ కానుంది. ఇది పక్కాగా అమలయితే, అధికారులు, ఇదే సందర్భంలో గత ఎనిమిదేళ్లలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షించుకునే తరుణం ఇది. అనేక పథకాలు గుదిబండగా ఉన్నాయి. ఆర్థికంగా దెబ్బ తీస్తున్న పథకాలను సమీక్షించుకోవాలి. లేకుంటా ఖజానాపై తీవ్ర ప్రభావం పడనుంది. అలాగే దండగ మారి పథకాలను సమీక్షించుకోవాలి. కిలో రూపాయి బియ్యం పథకం తక్షణం సవరించాలి. అలాగే రైతుబంధునుంచి అనర్హులను కూడా తొలగించాలి. పెన్షన్ స్కీమ్‌ను 60 నుంచే మొదలు పెట్టేలా కొనసాగించాలి. అందులోనూ అనర్హులను గుర్తించే ప్రక్రియ చేపట్టాలి. లేకుంటే ఇవన్నీ కూడా ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఇప్టపికే ఆర్థికంగ దెబ్బతిన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉంది. ఇక గురుకులాల ఏర్పాటు కూడా ఓ విప్లవాత్మకమైన మలుపుగా చెప్పుకోవాలి. పేదలకు ఉచిత విద్యను అందించే క్రమంలో ఇదో అపురూపమైన ఘట్టంగా చెప్పుకోవాలి. చేపట్టిన పనిని చివరి వరకు వదలకుండా చేసే ధైర్యం,స్థయిర్యం ఉన్న సిఎంగా కెసిఆర్ సంస్కరణల్లోనూ ముందుండాలి. ఈ సారి కూడా రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చింది. అందుకు తగ్గట్టుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే పంటల కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు నష్టపోతున్నారు. ఇవన్నీ సమీక్షించుకుంటేనే ప్రజలకు మేలు చేసిన వారు అవుతారు. కేవలం డబ్బుల పందేరం మాత్రమే పాలన అనుకుంటే ప్రజలు కూడా నమ్మరని గుర్తించాలి.

**పృద్విరాజ్ గోసుకొండ**
ఎడిటర్

# కేంద్ర సహకారం లేకున్నా ప్రగతిపథంలో తెలంగాణ

**బిజెపి నేతలు విమర్శలు మాని కేంద్రంతో పోరాడాలి ● తెలంగాణ పథకాలు, అభివృద్ధి నమూనా దేశానికి ఆదర్శం**

**మంత్రి వేముల ప్రశాంతరెడ్డి వెల్లడి**



**నిజామాబాద్, మే 31 (అక్షర వెలుగు):)** సమైక్య రాష్ట్రంలో కష్టపడింది మేం. ఇబ్బందులు పడ్డది మేం. నష్టపోయింది మేం. వలసలు పోయింది.. ఆత్మహత్యలు చేసుకున్నది మా రైతులు. నీళ్లు మాకు రాలే. మా గొంతులు ఎండినయి, మా పొలాలు బీళ్లు వారినయి..వీటన్నింటిని అధిగమించి ఇప్పుడు ముందుకు సాగుతున్నాం.. తెలంగాణ ఏర్పడ్డ తరవాతనే ఒక్కో సమస్యను అధిగమిస్తూ తెలంగాణ ప్రగతి పథంలో సాగేలా సిఎం కెసిఆర్ కృషి చేస్తున్నారని మంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఈ విషయంలో కేంద్రం ఎక్కడా మాకు సహకారం అందించలేదని మంత్రి అన్నారు. బిజెపి నేతలు విమర్శలు మాని తెలంగాణ పథకాలకు ఎక్కడ సాయం అందించారో చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయం లో కూడా కేంద్రం వద్ద ప్రణాళిక లేదన్నారు. ఎనిమిదేళ్ల తెలంగాణలో అద్భుత ప్రగతి కళ్లకు కడుతోంద న్నారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాన్ని ఆయన తూర్పారా బట్టారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ అనే రెండు పథకాలు మంచిగ ఉన్నాయని నీతిఆయోగ్ వాళ్లు రెండింటికి కలిపి రూ.24 వేల కోట్లు ఇవ్వండని కేంద్ర ప్రభుత్వానికి రికమండ్ చేస్తే రూ.24 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. రాజ్యాంగ బద్ధంగా కేంద్ర పన్నుల వాటాల్లో రావాల్సిన డెవల్యూషన్ ఫండ్స్ వాటా తప్ప అదనంగా ఒక్క రూపాయి రాలేదని చెప్పారు. గత ఎనిమిది సంవత్సరాల్లో కేంద్రంలో మనకు అనుకూలమైన ప్రభుత్వం లేదు. అయినప్పటికీ అభివృద్ధి సాధించిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌కే చెల్లిందని చెప్పారు. రానున్న రోజుల్లో తెలంగాణ సమకూర్చుకునే ఆదాయం.. పెట్టే ఖర్చు రూ.10 లక్షల కోట్లపైనే ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలవల్లే పోడు భూముల సమస్య పరిష్కారం కాకుండా పోయిందన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి కోయలు వలసరావడం కూడా పోడు భూముల విషయంలో సమస్యగా మారిందని.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆ సమస్యను తప్పకుండా పరిష్కరి స్తామని చెప్పారు. ఇకపోతే ప్రస్తుతానికి భూమి ఉన్న ప్రతి ఒక్క రైతుకు రైతుబంధు పథకం కింద పంట పెట్టుబడి అందుతుంది. రైతులకు పంట పెట్టుబడి ఇచ్చే ఈ రైతు బంధు పథకం ఇక నిరంతరాయంగా కొనసాగు తుందని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయాన్ని పండగగా మార్చేం దుకు సిఎం కేసిఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు రైతు పంట పెట్టుబడి కోసం ఎవరివైపు చూడకుండా ఉండేందుకు ఎకరానికి 5000 చొప్పున ఏటా 10000 రూపాయల ఆర్థిక సాయం చేస్తున్నారని చెప్పారు. దేశంలో ఇంత వరకు రైతుకు పంట పెట్టుబడి ఇచ్చిన ప్రభుత్వంగానీ, నాయకులు గానీ లేరన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన ఈ పంట పెట్టుబడి పథకంవైపు దేశం మొత్తం చూస్తోందన్నారు. వ్యవసాయానికి కనీసం రెండు గంటలు కూడా కరెంటు రాని పరిస్థితిని మార్చి 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నారని, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నారని, కోటి ఎకరాలను మాగాణాగా మార్చేందుకు సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నారని అన్నారు. రైతులకే కాకుండా పేదింట్లో ఆడపిల్ల పెళ్లి తల్లిదండ్రులకు భారం కావద్దని మొదట్లో 51వేల రూపాయలు ఇచ్చారని, అది సరిపోదని దానిని 75వేల రూపాయలకు పెంచారని, అదీ చాలడం లేదని ఇప్పుడు లక్షా 116 రూపాయలను ఇస్తున్నారన్నారు. పేదింట్లో ఆడపిల్ల గర్భం దాల్చితే ప్రసవం అయ్యే వరకు పని చేయాల్సి వస్తుందని గుర్తించిన సిఎం కేసిఆర్ ఇక అలాంటి పరిస్థితి ఉండొద్దని ప్రసవానికి మూడు నెలల ముందు, ప్రసవం తర్వాత మూడు నెలల వరకు నెలకు 2000 రూపాయల చొప్పున ఆరు నెలల పాటు 12వేల రూపాయలు, ఆడపిల్ల పుడితే అదనంగా 1000 రూపాయలు కలిపి 13వేల రూపాయలు అందిస్తున్నారని చెప్పారు. అంతే కాకుండా తల్లిబిడ్డలను అమ్మఒడి వాహనంలో ఇంటి దగ్గర దించుతున్న ప్రభుత్వం దేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒక్కటేనని అన్నారు. ఇంతటి మంచి పథకాలు అమలు చేస్తున్న సిఎం కేసిఆర్ ను నిండు మనసుతో దీవించాలని మంత్రి వేముల కోరారు.

# ప్రతి రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు

(మొదటి పేజి తరువాయి) పట్ల గర్వపడుతున్నాం. సేవా, సుపరిపాలన,పేదల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఉండాల్సిందే. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల ప్రజలకు మేలు జరుగుతుంది.. అవినీతి తగ్గిపోతుంది. సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. పేదలకు అన్యాయం జరగవద్దు... పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలి. ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. 2 వందల కోట్ల వ్యాక్సినేషన్‌ను ఉచితంగా ఇచ్చాం. యువత స్వయం సమృద్ధి కోసం ముద్రా రుణాలు అందించాం. ఓటు బ్యాంకు కోసం కాదు నయా భారత్ కోసమే.. ఈ సంస్కరణలు అంటూ ప్రధాని ఏకరువు పెట్టారు. ప్రజల నమ్మకాన్ని పొందడానికి ప్రయత్నిస్తున్నాం. ఎగుమతుల్లో భారత్ చరిత్ర సృష్టించింది. మెడికల్, టెక్నికల్ విద్యను మాతృభాషలో అందించేందుకు కృషి చేస్తున్నాం. పేదల ఆరోగ్యం కోసమే 5 లక్షలతో ఆయుష్మాన్ భారత్ పథకం ప్రవేశ పెట్టామని నరేంద్ర మోదీ అన్నారు. రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కిసాన్ సమ్మాన్ యోజన కింద 10కోట్ల మంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం హర్షణీయమని తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌ను తెలంగాణకు కేసీఆర్ రానివ్వట్లేదని విమర్శించారు. 'చేపల, పాల ఉత్పత్తి పెంచే దిశగా ప్రయత్నం చేస్తున్నాం. పాల ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ అగ్ర భాగాన నిలిచింది. 20 లక్షల ఇల్లు కట్టించాం. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎన్ని డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టింటినా.. కేంద్రం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. రెండు లక్షల కోట్ల రూపాయలు నగదును అందజేశారు. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక.. పది కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం. 12 కోట్ల మరుగుదొడ్లు కేంద్ర ప్రభుత్వం కట్టించింది. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా దేశంలో ఎక్కడైనా 5 లక్షల మేరకు ఉచితంగా వైద్యం పొందవచ్చు. కేసీఆర్ ప్రజలను కలవడు. సచివాలయం రాకుండా ప్రగతిభవన్, ఫామ్‌హౌస్‌లోనే పడుకుంటాడు. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక బాంబు పేలుళ్లు, మత కలహాలు లేవని కిషన్ రెడ్డి అన్నారు. దేశంలో రైతుల సంక్షేమానికి కేందప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

## ప్రపంచవ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

(మొదటి పేజి తరువాయి) మహేష్ బిగాల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎంతో మంది తెలంగాణ అమరవీరుల త్యాగఫలంతో 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. నీళ్లు, నిధులు, నియమకాల నినాదంతో దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ ప్రగతిపథలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. బంగారు తెలంగాణ తెలంగాణ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. నీళ్లు, నిధులు, నియమకాల నినాదంతో దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. బంగారు తెలంగాణ తెలంగాణ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలనే ఉపయోగించాలి

(మొదటి పేజి తరువాయి) హాని కారక కెమికల్స్‌ను విగ్రహాల తయారీలో నిషేధిస్తూ కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. పీఓపీతో తయారు చేసిన విగ్రహాలను ట్యాంక్ బండ్‌తో పాటు నగరంలోని ఇతర చెరువుల్లో కూడా నిమజ్జనం చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీచేసిందని సీఎస్ వివరించారు. ఈ అంశాలపై విగ్రహ తయారీదారులను చైతన్య పర్చాలని సూచించారు. నగరంలో మట్టి వినాయకుల తయారీ దార్లను ప్రోత్సహించడంతోపాటు మట్టి విగ్రహాల మార్కెటింగ్ కు తగు ప్రోత్సాహం ఇవ్వాలని సీఎస్ సూచించారు. హైకోర్టు, సుప్రీం కోర్టు ఆదేశాలను పాటించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో సెప్టెంబర్‌లో



జరిగే గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ మంగళవారం బీఆర్కేఆర్ భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ ఎం. మహేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, అడిషనల్ డీజీ జితేందర్, హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు సీవీ ఆనంద్, మహేష్ భగవత్, జీహెచ్ ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, కాలుష్య నియంత్రణా మండలి కార్యదర్శి నీతూ ప్రసాద్‌లు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## తెలంగాణలో తగ్గిన రైతు ఆత్మహత్యలు



(మొదటి పేజి తరువాయి) సూచించారు. సిద్దిపేట, మెదక్ జిల్లాలో కనీసం 25 వేళ ఎకరాల చొప్పున విత్తన సాగు చేపట్టాలని మంత్రి సూచించారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం వల్ల అద్భుతాలు సృష్టించవచ్చని హరీష్ రావు అన్నారు. ములుగు రీసెర్చ్ సెంటర్ లో మిరపసాగు నారు పెద్ద ఎత్తున అందిస్తే రైతులకు మేలు జరుగుతుందని హరీష్ రావు తెలిపారు. గజ్వేల్, మెదక్‌లో రాక్ పాయింట్ ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ మంత్రికి హరీష్ రావు విజ్ఞప్తి చేశారు. ఇక బీజేపీ, కాంగ్రెస్‌లు రైతులకు చేసింది శూన్యమన్నారు.

## యూపి నుంచి రాజ్యసభకు డాక్టర్ లక్ష్మణ్



(మొదటి పేజి తరువాయి) కార్యకర్తలు,నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక.. అంకితభావంతో పనిచేస్తే సాధారణ కార్యకర్తకు కూడా మంచి పదవులు వస్తాయనడానికి ఇదే నిదర్శనమని లక్ష్మణ్ అన్నారు. పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నెరవేరుస్తానన్నారు. 50 శాతం ఉన్న బీసీలకు సరైన గుర్తింపునిచ్చారని, ఏనాడూ కూడా పార్టీల్లో పదవుల కోసం ఆశించలేదని, 45 సంవత్సరాలుగా పార్టీకి పని చేయడం జరుగుతోందని తెలిపారు. పార్టీ తనకు ఎన్నో పదవులు కట్టబెట్టిందని, తనకు రాజ్యసభ సీటు ఇవ్వడం ప్రజల గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సబ్ కా సాత్..సబ్ కా వికాస్ లక్ష్యంతో మోదీ పని చేస్తున్నారన్నారు. కలిసి పని చేస్తే తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి బీజేపీ రావడం ఖాయమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం నిరుద్యోగులు, యువకులు, అనేక మంది ఆహుతులైనట్లు.. ప్రజలు అన్నీ గమనిస్తున్నట్లు వెల్లడవించారు. ముషిరాబాద్ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు లక్ష్మణ్ తెలిపారు. భాజపా ఓబీసీ జాతీయ మోర్చా అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌ను ఉత్తర్‌ప్రదేశ్ నుంచి రాజ్యసభకు బరిలోకి దింపాలని ఆ పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం రాత్రి నలుగురు అభ్యర్థులతో.. జాబితా విడుదల చేసింది. ఇందులో మధ్యప్రదేశ్ నుంచి సుమిత్ర వాల్మీకి, కర్ణాటక నుంచి లహర్ సింగ్ సరోయ, యూపీ నుంచి మిథిలేష్ కుమార్, కె.లక్ష్మణ్ పేర్లను ప్రకటించింది.వచ్చే ఏడాది జరగబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా.. పార్టీ అధిష్ఠానం వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. దిగువ సభలో తెలంగాణ నుంచి నలుగురు ఎంపీలు ఉండగా.. ఎగువసభలో రాష్ట్ర విషయాలు వచ్చినప్పుడు పార్టీ నుంచి మాట్లాడేవారు కరవయ్యారు. ఆ లోటును భర్తీ చేయడంతో పాటు.. తెలంగాణలోని బలమైన మున్నూరు కాపు, మొత్తం ఓబీసీ సామాజిక వర్గాన్ని దగ్గర చేసుకునేందుకు.. భాజపా ఎత్తుగడ వేసినట్లు కనిపిస్తోంది. మంగలవారం నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కాగా.. ఉదయం లక్ష్మణ్ లక్నో వెళ్లారు. మధ్యాహ్నం రాజ్యసభ స్థానానికి నామినేషన్ వేయనున్నారు.

## కేఎఫ్‌సి చికెన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు

(మొదటి పేజి తరువాయి) మూసాపేట సర్కిల్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఔట్‌లెట్‌ను తనిఖీ చేసి పలు రకాల చికెన్ వస్తువుల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డీసీ రవికుమార్ ట్విటర్‌లో వెల్లడించారు. ఇకపోతే ఇటీవలే బావర్చిహోటల్ బిర్యానీ ప్రత్యక్షమయ్యింది. దీంతో రామ్‌నగగర్ కార్పోరేటర్ రవిచారి ఫిర్యాదుచేశారు. మరోవైపు పీర్జాదిగూడలో రిలయన్స్ స్మార్ట్‌లో మిల్క్‌షేక్ కొనుగోలు చేసి తాగిన బాలుడు అస్వస్థతకు గురయ్యాడు. బాలుడిని తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి కడుపు శుభ్రం చేశారు. బాలుడు వాంతి చేసుకోగా అందులో బల్లి కనిపించింది. నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పీర్జాదిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని రిలయన్స్ స్మార్ట్‌లో స్థానికంగా నివసిస్తున్న సహస్ర(9) డిలాయిట్ మిల్క్ షేక్ కొనుగోలు చేశాడు. దానిని తాగిన తర్వాత అనారోగ్యానికి గురయ్యాడు. తల్లిదండ్రులు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు సహస్రకు వాంతులు చేయించగా బల్లి బయటపడింది. బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. సోమవారం బాలుడి తల్లిదండ్రులు, బంధువులు రిలయన్స్ స్మార్ట్ ఎదుట ఆందోళన చేపట్టారు. చికిత్సకు ఖర్చయిన డబ్బు చెల్లించాలని డిమాండ్ చేశారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు రిలయన్స్ స్మార్ట్ మేనేజర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## శబరి ఎక్స్‌ప్రెస్‌కు బాంబు బెదిరింపు

**హైదరాబాద్, మే 31 (అక్షర వెలుగు):):** శబరి ఎక్స్‌ప్రెస్‌కు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. శబరి ఎక్స్‌ప్రెస్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి చెప్పారు. దీంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలును నిలిపివేశారు. బాంబు, డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులు ఎవరూ ఆందోళనకు గురికావొద్దని పోలీసులు సూచించారు. అయితే ఇది ఫేక్ కాల్ అయివుంటుందని భావిస్తున్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

(మొదటి పేజి తరువాయి) విజ్ఞప్తి చేయడం కూడా అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే రఘునందన్ కోరారు. వడ్ల కొనుగోలులో తీవ్ర జాప్యం చేస్తుండడంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రైతులు ఆందోళనకు దిగుతున్న సంగతి తెలిసిందే. వర్షానికి వడ్లు తడిసిపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్లు పూర్తిగా బంద్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నట్లు, కాంటా పెట్టిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. వడ్లను సెంటర్?కు తీసుకువచ్చి రోజులు గడుస్తున్న కాంటా వేయకుండా జాప్యం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### మరోమారు నగర శివారుప్లాట్లకు వేలం

(మొదటి పేజి తరువాయి) 9.5 ఎకరాల్లో వేసిన లే అవుట్‌లోని 34 ప్లాట్లను అమ్మకానికి పెట్టినట్లు పేర్కొంది. తుర్క యాంజల్ లో సగటున 600 నుంచి 1060 గజాల విస్తీర్ణంలో ప్లాట్లు ఉన్నాయని, గజం ధర రూ.40వేలు ఉందని తెలిపింది.

# గ్రామ సర్పంచ్‌లకు అండగా ఉంటాం

(మొదటి పేజి తరువాయి) మద్దతు ఇస్తుందన్నారు. గ్రామసర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ కోసం త్వరలోనే బీజేపీ శాఖ మౌనదీక్ష నిర్వహిస్తుందన్నారు. పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను టీఆర్ఎస్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందన్నారు. 2014లో టీఆర్ఎస్ పార్టీ 'గ్రామీణాభివృద్ధి', 'పంచాయతీరాజ్ వ్యవస్థ' అనే అంశం కింద ఇచ్చిన హామీలకు తిలోదకాలు ఇచ్చిందన్నారు. సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడవద్దని.. అధైర్యపడవద్దని.. అందరికీ బీజేపీ అండగా ఉంటుందని బండి సంజయ్ హామీ ఇచ్చారు. న్యాయమైన డిమాండ్ల కోసం గ్రామ సర్పంచ్‌లు చేసే ఆందోళనలకు భాజపా ఎప్పుడూ సంపూర్ణ మద్దతునిస్తుందని చెప్పారు. గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. సర్పంచ్‌ల పట్ల జిల్లా అధికారుల వేధింపులు ఆపాలన్న బండి సంజయ్.... గ్రామాలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, గ్రామసర్పంచ్‌ల హక్కులు పరిరక్షణ కోసం త్వరలోనే బిజెపి శాఖ మౌనదీక్ష చేపడుతుంని తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తుందని దుయ్యబట్టారు. టీఆర్ఎస్ పార్టీ 2014 లో 'గ్రామీణాభివృద్ధి', పంచాయతీరాజ్ వ్యవస్థ' అనే అంశం కింద ఇచ్చిన హామీలకు తిలోదకాలు ఇచ్చిందన్నారు. సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడొద్దు, అధైర్యపడొద్దన్న ఆయన... మీకు బిజెపి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. - గ్రామసర్పంచ్‌లు, స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు సగర్వంగా తలెత్తుకునేలా చేసే బాధ్యత బిజెపిదని చెప్పుకొచ్చారు. గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం... గ్రామస్వరాజ్యం సాదిద్దాం ... రామరాజ్యాన్ని నిర్మించుకుందాం ... అంటూ బండి సంజయ్ పిలుపునిచ్చారు.

# తడి చెత్తతో బయోగ్యాస్ ఉత్పత్తి

**రెండెకరాల విస్తీర్ణంలో ఏర్పాటు**

**మహబూబ్‌నగర్‌లో ప్లాంట్ ఏర్పాటుపై మంత్రి**



**మహబూబ్‌నగర్, మే 31 (అక్షర వెలుగు):** తడి చెత్త నుంచి కంప్రెస్డ్ బయో గ్యాస్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను మహబూబ్‌నగర్‌లో నెలకొల్పుతామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు రూ.16 కోట్ల వ్యయంతో రెండు ఎకరాల విస్తీర్ణంలో మహబూబ్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేయనున్న ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర రేనివబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో మహబూబ్ నగర్ మున్సిపాలిటీ అధికారులు మంత్రి సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటులో భాగంగా తడి చెత్తను సేకరించి దాని ద్వారా కంప్రెస్డ్ బయో గ్యాస్ ను ఉత్పత్తి చేస్తుంది. ఇందుకుగాను ఒక టన్ను తడి చెత్తకు రూ. 150 చొప్పున మున్సిపాలిటీకి చెల్లిస్తారు. నిత్యం 40 నుంచి 50 టన్నుల చొప్పున తడి చెత్త సేకరిస్తే ప్రతి సంవత్సరం రూ. 22 లక్షల ఆదాయం మున్సిపాలిటీకి వస్తుందని మంత్రి వెల్లడించారు. గతంలో చెత్తను ఎక్కడబడితే అక్కడ పడవేసేవారని, చెత్తను తొలగించేందుకు మున్సిపాలిటీ ద్వారా డబ్బులు ఖర్చు చేసే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా కాకుండా మున్సిపాలిటీకే ఆదాయం వస్తుందని తెలిపారు. దీనివల్ల మున్సిపాలిటీ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా ఎలాంటి కాలుష్యం లేకుండా ఉంటుందని, మున్సిపాలిటీకి అదనపు ఆదాయం వచ్చేలా అవకాశం ఉందని తెలిపారు. ఈ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన రెండెకరాల స్థలాన్ని కూడా తక్షణమే గుర్తించి ఇవ్వాలని ఆయన మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ తర్వాత మహబూబ్ నగర్‌లోనే తడి చెత్తతో బయోగ్యాస్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ను నెలకొల్పనున్నట్లు మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, టీఎస్ రెడ్కో జిల్లా మేనేజర్ జేఎస్ఎన్ మూర్తి, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

జిల్లా ఎస్.పి. రోహిణి ప్రియదర్శి ఐ.పి.ఎస్



**మెదక్, మే 31(అక్షర వెలుగు):** మెదక్ జిల్లా పోలీసు కార్యాలయం జిల్లాలో 30, 30 (ఎ) పోలీసు యాక్ట్ అమలు : జిల్లా ఎస్.పి. రోహిణి ప్రియదర్శి ఐ.పి.ఎస్. జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల (జూన్ 1వ తేది నుండి 30 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్.పి. రోహిణి ప్రియదర్శిని ఐ.పి.ఎస్ తెలిపినారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపినారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి. గారు హెచ్చరించారు. కాబట్టి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని తెలిపినారు.

## పేదవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరం

ఎమ్మెల్యే క్రాంతి కిరణ్



**అందోల్, మే 31 (అక్షర వెలుగు):** పేదవారికి వరం ల ముఖ్యమంత్రి సహాయనిది ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అనారోగ్యంతో బాధపడుతున్న అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ గ్రామనికి చెందిన దార్మయి లక్ష్మీ కి లక్ష రూపాయల LOC ని ముఖ్యమంత్రి సహాయనిది నుండి గౌరవ అందోల్ ఎమ్మెల్యే శ్రీ.చంటి క్రాంతి కిరణ్ గారు గ్రామ, మండల నాయకుల ద్వారా అందచేసారు. ప్రజలకు కష్టం వచ్చిందంటే వెంటనే స్పందించే ఎమ్మెల్యే క్రాంతన్న గారు నిరుపేదలను హక్కున చేర్చుకొని సహాయం అందిస్తున్నారు. మాకు సహాయం చేసి చికిత్సాకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి, ఎమ్మెల్యే క్రాంతన్న గారికి సహకరించిన గ్రామ మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సీసీ రోడ్ పనులను ప్రారంభం

ఎమ్మెల్యే క్రాంతి కిరణ్



**అందోల్, మే 31 (అక్షర వెలుగు):** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గంలో అందోల్ – జోగిపెట్ 15వ వార్డులో సీసీ రోడ్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే క్రాంతి కిరణ్.పట్టణాలను అభివృద్ధి చేయడమే ఉద్దేశంతో కొనసాగుతున్న కార్యక్రమంలో భాగంగా అందోల్ జోగిపేట్ మున్సిపల్ 15వ వార్డులో 300మీటర్లు 14.5లక్షల విలువగల సీసీ రోడ్ పనులను ప్రారంభించారు. అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లికార్జున్, వైస్ చైర్మన్ డేవిడ్, మాజీ పార్టీ అధ్యక్షులు చాపల వెంకటేశం, కౌన్స్ లర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 46వ డివిజన్ లో నిలిచిన స్మార్ట్ సిటీ పనులను ప్రారంభించండి



**కరీంనగర్, మే 31 (అక్షర వెలుగు):** నగరంలోని 46వ డివిజన్ పరిధిలోని పాత శిశు మందిర్ పాఠశాల ఎదుట గత 8నెలల నుండి అసంపూర్తిగా నిలిచిన సైడ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్ జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్ కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రెండు చోట్లా విద్యుత్ పోళ్ళు అడ్డంగా ఉన్నాయని, రోడ్డుపై కంకర కుప్పలతో వాహన చోదకులకు, బాట సారులకు ఇబ్బంది గా మారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వినతిపత్రం లో పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు షెహబాజ్, కలీం తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ అధికారులకు రాష్ట్రస్థాయిలో ప్రశంసాపత్రాలు



**కరీంనగర్, మే 31 (అక్షర వెలుగు):** పోలీసు శాఖలో అధికారుల వృత్తిపరమైన పని సామర్థ్యాన్ని పెంపొందించేందుకు అమలు చేస్తున్న ఫంక్షనల్ వర్టికల్ విభాగాల్లో అత్యంత ప్రతిభను ప్రదర్శించిన పోలీసు అధికారులకు మంగళవారం నాడు హైదరాబాద్లో రాష్ట్ర డిజిపి ప్రశంసా పత్రాలను అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 256 మందిని ఎంపిక చేయగా కరీంనగర్ కమీషనరేట్ నుండి 6 అధికారులు అధికారులు ఎంపికయ్యారు. ఎంపికైన అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి ఇన్స్పెక్టర్లు బి సంతోష్ కుమార్ (సిఎస్బి కరీంనగర్), వై కృష్ణారెడ్డి (ఇన్స్పెక్టర్ మానకొండూరు), యం డి నజీమ్ (కానిస్టేబుల్ వీణవంక) జి వేణుగోపాల్, వి ప్రభాకర్ (హోంగార్డు లు రామడుగు), యం కవిత (కానిస్టేబుల్ కొత్తపల్లి) లు మంగళవారం నాడు వివిధ విభాగాల్లో రాష్ట్ర డీజీపీ నుండి ప్రశంసాపత్రాలను అందుకున్నారు. వర్టికల్ స్ విధానం అమలు వల్ల కేసుల దర్యాప్తులో మెరుగైన ఫలితాలు రావడంతో పాటు నేరస్తులకు సకాలంలో శిక్షలుపడి అతి తక్కువ సమయంలో కేసులు పూర్తి అవుతున్నాయి. వివిధ విభాగాల్లో కరీంనగర్ కమీషనరేట్ నుండి ప్రశంసాపత్రాలను అందుకున్న పోలీసు అధికారులను కరీంనగర్ పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ అభినందించారు

## రైతుల శ్రేయస్సు కోసం కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం ఎనలేని కృషి

భారీ సబ్సిడీపై ఎరువులు అందిస్తున్న ఘనత మోడీ ప్రభుత్వందే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్




**కరీంనగర్ 31 మే (అక్షర వెలుగు):** దేశవ్యాప్తంగా రైతుల ప్రయోజనాలు, శ్రేయస్సు కోసం కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని, రైతులకు భారం పడకుండా భారీ సబ్సిడీతో ఎరువులను అందిస్తున్న ఘనత మోడీ ప్రభుత్వానికే దక్కుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ తెలిపారు. పీఎం కిసాన్ పథకం కింద 11 విడత నిధులను మంగళవారం దేశ వ్యాప్తంగా ప్రధాని మోడీ విడుదల చేసిన సందర్భంగా మానకొండూరు నియోజకవర్గం అన్నారం గ్రామంలో జీఎన్ఎస్ ఎస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఎఫ్ బి ఓ అవగాహన సమావేశ కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం ద్వారా అర్హులైన రైతులకు కేంద్రం ఏటా 3 విడతల్లో రూ. 2000 చొప్పున 6000 అందిస్తుందని చెప్పారు. ఇట్టిమొత్తం నేరుగా రైతు లబ్ధిదారుల ఖాతాలకు జమ అవుతున్నాయని, పార్లమెంటు పరిధిలో లక్షలాది మంది రైతులకు దీంతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. రైతును రాజు చేయాలనే కాంక్షతో కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తూ ఆలోచన చేస్తుందన్నారు. ముఖ్యంగా రైతులపై ఎరువుల భారం పడకుండా ఇటీవల తక్కువ ధరకు అందించడానికి వీలుగా కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. డి ఏ పి, నైట్రోజన్, పొటాషియం, ప్రాస్పరస్, ఎరువులకు సబ్సిడీ అందించడానికి 1 లక్ష 60 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తుందని వివరించారు. ఒక బస్తా డీఏపీ ధర 3,851 ఉందని, సబ్సిడీ పొందే రైతులు 1,350 కె ఒక ఒక బస్తా పొందే విధంగా సబ్సిడీతో అందిస్తున్న విషయం రైతులు గ్రహించాలన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఫెర్టిలైజర్ల ధరలు పెరిగినా దేశంలో రైతులపై కేంద్రం భారం మోప లేదన్నారు. రైతులపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం లాంటిదన్నారు. దేశం యొక్క స్థితిని, గతి శక్తిని మార్చడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎనిమిదేళ్లలో అనేక అద్భుతాలను సృష్టించి మెరుగైన పాలను అందిస్తుందన్నారు. ఎనిమిదేళ్ల మోడీ పాలన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయని చెప్పారు. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ప్రారంభించిన ఎఫ్ బీవోకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రూ. 15లక్షలు నేరుగా ఖాతాలో జమ చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సందర్భంగా పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలో 2 లక్షల 39 వేలకు పైగా రైతుల ఖాతాల్లో నేరుగా రూ. 400 కోట్లకు పైగా జమ అయ్యాయని తెలిపారు.

## వరల్డ్ నో టూబాకో డే





**కరీంనగర్ మే 31 (అక్షర వెలుగు):** తేది 31.05.2022 మంగళ వారం ప్రపంచ పొగాకు వ్యతిరేఖ రోజును (WORLD NO TOBACO DAY) పురస్కరించుకొని అవగాహన ర్యాలీని జిల్లా ప్రధాన ఆసుపత్రి నందు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. జువైరియా జెండా వూపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు వుత్పతులైన బీడీ, గుట్కా, తంబాకు, ఖైని, జర్దా వంటి పదార్థాలు వాడటం వలన శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, కాన్సర్, మధుమేహం వంటి వ్యాధులు వస్తాయని ప్రపంచ వ్యాప్తంగా 60 లక్షల మంది జనాభా పొగాకు వాడటం వలన చనిపోతున్నారని మన దేశంలో సుమారు 10 లక్షల పైచిలుకు జనబా ఈ పొగాకు వాడకం వల్ల వచ్చు వ్యాధుల వలన చనిపోతున్నారని చెప్పారు.COTPA ACT 2003 ప్రకారం బహిరంగ ప్రదేశాలలో లేదా ఆఫీస్ లో పోగాత్రాగడం మరియు పొగాకు వుత్పత్తుల ప్రకటన పట్ల నిషేదం మరియు 18 సం. లోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులను దూకాణాదారులు అమ్మరాధని , అన్ని పొగకు వుత్పతుల మీద హెచ్చరికలు ఉండాలని, స్కూల్ కాలేజీ ఆవరణం నుండి 100 గజాల వరకు పొగాకు వుత్పతులు అమ్మడం నేరమని, అట్టి వారిపై ఫైన్ విధిస్తూ "జిల్లా ఎన్ఫోర్స్మెంట్ స్కాడ్" చర్యలు ఎ తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమలో జిల్లా క్షయ నివారణ అధికారి డా. రవీందర్ రెడ్డి గారు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. సాజిధా, PODTT డా, రాజగోపాల్ రావు, DEMO రంగారెడ్డి, రాజగోపాల్, పుష్ప H.E.E.O, NTCP సోషల్ వర్కర్ రమణాకర్ రెడ్డి గారు, GNM విద్యార్థులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

## డబ్బులు డిమాండ్ చేసిన మార్చురీ ఉద్యోగి తొలగింపు

ఉస్మానియా సూపరింటెండెంట్ నాగేందర్

**హైదరాబాద్, మే 31 (అక్షర వెలుగు):** రూ.వెయ్యి ఇస్తేనే మార్చురీలో మృతదేహాన్ని పెడతామంటూ ఓ కుటుంబం పట్ల ఉస్మానియా మార్చురీ సిబ్బంది వ్యవహరించిన తీరుపై సూపరింటెండెంట్ నాగేందర్ స్పందించారు. ఉస్మానియా ఆస్పత్రి మార్చురీ వద్ద జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. డబ్బులు డిమాండ్ చేసిన కాంట్రాక్టు ఉద్యోగి రాజును విచారించామని... అతడిని విధుల నుండి తొలగిస్తున్నట్లు తెలిపారు. మార్చురీ దగ్గర డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న సమాచారం ఉందన్నారు. కిందిస్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు అవగాహన తీసుకువస్తున్నామని సూపరింటెండెంట్ అన్నారు. ఇంత పెద్ద హాస్పిటల్లో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఎక్కడో ఓ దగ్గర ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. ఉస్మానియాకు చెడ్డ పేరు తీసుకువచ్చే విధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హాస్పిటల్లో కూడా సలహాలు, ఫిర్యాదుల బాక్స్లు ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా ఇలాంటి అవినీతి జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని సూపరింటెండెంట్ నాగేందర్ తెలిపారు.

## కుక్కల దాడిలో జింక బలి



**ఖమ్మం, మే 31 (అక్షర వెలుగు):** సత్తుపల్లిలో వీధి కుక్కలు వీరంగం సృష్టించాయి. ఓ మచ్చల జింకపై దాడి చేసి చంపాయి. సత్తుపల్లి అర్బన్ పార్క్ ఏరియాకు సమీపంలోని జలగం నగర్ కాలనీలోకి ఓ మచ్చల జింక మంగళవారం ఉదయం వచ్చింది. దీంతో వీధి కుక్కలు జింకను చుట్టుముట్టి దాడి చేశాయి. దీంతో తీవ్ర గాయాలపాలైన జింక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు.. ఘటనాస్థలికి చేరుకుని జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నాయి. అనంతరం వెటర్నరీ హాస్పిటల్కు జింక కళేబరాన్ని తరలించారు.

## చిన్న ప్యాక్లలో విజయ ఉత్పత్తులు

నెయ్యి పాకెట్లను విడుదల చేసిన మంత్రి తలసాని



**హైదరాబాద్, మే 31 (అక్షర వెలుగు):** వినియోగదారుల కోసం విజయ డెయిరీ ఉత్పత్తులను తక్కువ ధరలలో చిన్న ప్యాక్లలో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం ఆదర్శనగర్లోని ఎమ్మెల్యే క్వార్టర్స్లో విజయ డెయిరీ ఆధ్వర్యంలో నూతనంగా ఉత్పత్తి చేసిన 10, 20 రూపాయలు, స్పెషల్ గ్రేడ్ అగ్ మార్క్ నెయ్యి ప్యాకెట్లను మంత్రి మార్కెట్ లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలలో విజయ డెయిరీ ఉత్పత్తులకు ఉన్న డిమాండ్ను దృష్టిలో ఉంచుకొని అనేక కొత్త ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. అన్ని రకాల విజయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు పెద్ద ఎత్తున ఔట్ లెట్ల ఏర్పాటు, ట్రై సైకిల్స్ ద్వారా విక్రయాలు జరుపుతున్న విషయాన్ని గుర్తుచేశారు. రానున్న రోజులలో నూతన ఉత్పత్తులు అనేకం మార్కెట్ లోకి తీసుకొచ్చి నూతన ఔట్ లెట్ లను మరిన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుం టున్నట్లు ఆయన వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ మార్కెటింగ్ జీఎం మల్లికార్జున్, అధికారులు మల్లయ్య, కామేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు. పదవీ విరమణ చేస్తున్న పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధర్ సిన్హా ను మంత్రి తలసాని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో అధర్ సిన్హా ఎంతో కృషి చేశారని ప్రశంసించారు.

## స్వీపర్ కొడుకు రేపటి ఐఎఎస్

సివిల్స్‌లో 117 ర్యాంక్ సాధించిన నరేశ్



**జయశంకర్ భూపాలపల్లి, మే 31 (అక్షర వెలుగు):** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాశింపల్లి గ్రామానికి చెందిన ఆకునూరి అయిలయ్య, సులోచన దంపతుల కుమారుడు నరేశ్ సివిల్స్లో మెరిసాడున పట్టుదలతో చదవడంతో 117 ర్యాంకు సాధించాడు. భూపాలపల్లి సింగరేణి ఏరియాలో డైలీ స్వీపర్గా సులోచన పనిచేస్తుండగా.. అయిలయ్య కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆకునూరి నరేశ్.. పదో తరగతి వరకు నర్సంపేట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, ఇంటర్మీడియట్ హైదరాబాద్ సోషల్ వెల్ఫర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో, మద్రాస్ కాలేజీలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదివాడు. తర్వాత సివిల్స్కు ప్రిపేర్ అయ్యాడు. 2020 ఆగస్టు 4న విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 782 ర్యాంకు సాధించి ఇండియన్ రైల్వేస్ పర్సనల్ సర్వీస్లో ఉద్యోగం సాధించి శిక్షణలో ఉన్నారు. అయితే ఎలాగైనా ఐఏఎస్ కావాలనే పట్టుదలతో ఉన్న నరేశ్.. మరోసారి సివిల్స్ రాశారు. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో 117వ ర్యాంకు సాధించాడు. నరేశ్ అన్న సురేశ్ 2018లో గ్రూప్–2 అధికారిగా సెలెక్ట్ అయ్యారు. వరంగల్లో అసిస్టెంట్ ట్యాక్స్ ఆఫీసర్గా పనిచేస్తున్నారు. తన అన్నను ఆదర్శంగా తీసుకొని సివిల్స్కు ప్రిపేర్ అయ్యారు.

## వేయి ఇస్తేనే మార్చురికీ శవం

మృతుడి బంధువులో సిబ్బంది వాగ్వాదం

**హైదరాబాద్, మే 31 (అక్షర వెలుగు):** హైదరాబాద్ నగరంలోని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో దారుణం జరిగింది. ఉస్మానియా ఆస్పత్రిలోని దారుణమైన పరిస్థితులు మరోసారి వెలుగులోకి వచ్చాయి. ఆస్పత్రి మార్చురీలో దారుణం చోటు చేసుకుంది. శవం విషయంలో మార్చురీ సిబ్బంది లంచం డిమాండ్ చేయడంతో పాటు బాధిత కుటుంబ సభ్యులపై జులుం కూడా ప్రదర్శించింది. ఓ మృతుడి కుటుంబం పట్ల మార్చురీ సిబ్బంది దురుసుగా వ్యవహరించారు. రూ. వెయ్యి ఇస్తేనే మృతదేహం మార్చురీలో పెడుతామంటూ ఇబ్బందికి గురిచేశారు. మద్యం మత్తులో మృతుడి బంధువులతో మార్చురీ సిబ్బంది వాగ్వాదానికి దిగారు. మార్చురీ సిబ్బంది తీరుపట్ల మృతుడి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాదర్ఘాట్లో ఆర్థిక ఇబ్బందులతో మజీద్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు మజీద్ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అయితే.. రూ. వెయ్యి ఇస్తేనే మృతదేహాన్ని తీసుకుంటామని మార్చురీ సిబ్బంది చెప్పడంతో గొడవ మొదలైంది. వెయ్యి రూపాయలు డిమాండ్ చేస్తూ మృతుడి బంధువులతో గొడవకు దిగారు. వాళ్లపై జులుం ప్రదర్శించారు. తాగిన మత్తులో మార్చురీ సిబ్బంది వీరంగం సృష్టించారు. బంధువులతో వాగ్వివాదానికి దిగిన మార్చురీ సిబ్బంది వ్యవహారంతో ఉస్మానియా ఆస్పత్రి వద్ద ఆందోళన నెలకొంది.

## అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రుల బిజీ

చిట్యాల బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎర్రబెల్లి

తెలంగాణ అభివృద్ధికి చిరునామా అన్న సత్యవతి

**జనగామ, మే 31 (అక్షర వెలుగు):** పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల, కొడకండ్ల, పెద్ద వంగర, తొర్రూరు, రాయపర్తి తదితర మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పెద్ద వంగర మండలం చిట్యాల గ్రామంలో జరుగుతున్న బోనాల ఉత్సవాలకు మంత్రి హాజరయ్యారు. మహిళలతో కలిసి కాటమయ్యకు బోన మెత్తారు. అనంతరం ప్రజలతో కలిసి కాటమయ్యను దర్శించుకున్నారు. ఇదిలావుంటే అభివృద్ధి, సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. జిల్లాలోని రేగొండ మండలం పోచంపల్లి గ్రామంలో నీతి అయోగ్ కింద మంజూరైన 10 లక్షల రూపాయలతో అంగన్వాడీ భవనాల మరమ్మతుల పనులను మంత్రి సత్యవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారన్నారు. కానీ, ప్రతిపక్షాలు మాత్రం పసలేని విమర్శలు చేస్తూ ప్రభుత్వంపై బురద జల్లుతు న్నాయని విమర్శించారు. తెలంగాణలో దేశంలో ఎక్కడలేని విధంగా సుపరిపరిపాలన సాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతిపక్షాలు విలువైన సూచనలు చేస్తే తీసుకుంటామన్నారు. అంతేకాని అర్థంలేని విమర్శలేని చేస్తే సహించమన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలిసి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, అడిషనల్ కలెక్టర్ దివాకరం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




# చలన చిత్రం

## లైగర్ కోసం అభిమానుల ఎదురుచూపు



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నుంచి సినిమా వచ్చి రెండేళ్ళు దాటింది. 2020లో భారి అంచనాలతో విడుదలైన 'వరల్డ్ ఫేమస్ లవర్' విజయ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా నిలిచింది. ఈ సినిమా ఫలితంతో విజయ్ తన తదుపరి సినిమాపై పూర్తి దృష్టిని పెట్టాడు. ఈ క్రమంలోనే రెండేళ్ళు 'లైగర్' కోసం కష్టపడ్డాడు. గత చిత్రాలకు భిన్నంగా విజయ్ పూర్తి మేకోవర్‌తో ఈ చిత్రంలో కనిపించనున్నాడు. మామూలుగా పూరి సినిమాలలో హీరోలకు సెల్ఫ్ రెస్పెక్ట్, యాటిట్యూడ్, తెగింపు ఉంటాయి. ఇక ఇవన్ని లక్షణాలు ముందుగానే ఉన్న రౌడీ బాయ్‌ను పూరి ఏ విధంగా చూపిస్తాడో అని ప్రేక్షకులలో ఆసక్తి నెలకొంది. దానికి తోడు చిత్రం నుంచి విడుదలైన ప్రచార చిత్రాలు, టీజర్ గ్లింప్స్ అంచనాలను అమాంతం పెంచాయి. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటున్న ఈ చిత్రం ఆగస్టు 25న విడుదల కానుంది. అయితే ఇదే కాంబోలో 'జనగనమణ' తెరకెక్కనున్నట్లు ఇటీవలే అధికారికంగా ప్రకటన వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమా షూటింగ్ జూన్ మొదటి వారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రంలో విజయ్ ఆర్మీ అధికారిగా కనిపించనున్నాడు. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించనుంది.

## నితిన్ పాటను విడుదల చేయనున్న కమల్




హిట్లు ఫ్లాపులతో సంబంధంలేకుండా వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులకు దగ్గరయ్యాడు యూత్ స్టార్ నితిన్. గతేడాది ఏకంగా మూడు సినిమాలతో ప్రేక్షకులను పలకరించాడు. ప్రస్తుతం నితిన్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'మాచర్ల నియోజక వర్గం'. రొటీన్‌కు భిన్నంగా నితిన్ ఈ సారి పొలిటికల్ థ్రిల్లర్ కథతో రానున్నాడు. ప్రముఖ ఎడిటర్ ఎం.ఎస్.రాజశేఖర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే చిత్రం నుంచి విడుదలైన టైటిల్ పోస్టర్, గ్లింప్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. తాజాగా మేకర్స్ ఈ చిత్రానికి సంబంధించిన బిగ్ అప్‌డేట్‌ను ప్రకటించింది. 'మాచర్ల నియోజక వర్గం' నుంచి 'చిల్ మారో చిల్ మారో' అంటూ సాగే ఫస్ట్ సింగిల్‌ను 'విక్రమ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కమల్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కాగా విక్రమ్ తెలుగు హక్కులను నితిన్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నితిన్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు గెస్ట్‌గా వెంకటేష్‌తో పాటు హాజరై తన సినిమాను ప్రమోట్ చేసుకోనున్నాడు. నితిన్ ఈ చిత్రంలో గుంటూరు జిల్లా కలెక్టర్‌గా నటించనున్నాడు.నితిన్‌కు జోడిగా కృతీశెట్టి, క్యాథెరీన్ థెరిస్సా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎన్.సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ చివరి దశలో ఉన్న ఈ చిత్రం ఆగస్టు 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. మహతి స్వర సాగర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు.

## 79వ పడిలోకి నటశేఖర కృష్ణ

### విషెస్ చెప్పిన మహేశ్ బాబు

టాలీవుడ్ ఫిల్మ్ ఇండస్ట్రీలో అద్భుతమైన సంచనాలు సృష్టించిన నటుడు, దర్శకుడు, నిర్మాత, సూపర్ స్టార్ కృష్ణ. తెలుగు సినిమాకు సరికొత్త టెక్నాలజీని పరిచయం చేసి, అందనంత ఎత్తుకు ఎదిగారు. తన సహజ నటనతో, హావ భావాలతో అందర్నీ ఆకట్టుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఎన్నో సాహస చిత్రాలను చేసి.. వినూత్న ప్రయోగాలకు కేరాఫ్ అడ్రస్ గా మారారు సూపర్ స్టార్ కృష్ణ. వెండితెరపై కౌ బాయ్ గా అలరించినా, కుర్రాడిలా చిందేసినా, వీరునిలా పోరాడినా, పెద్ద మనిషిలా తీర్పు చెప్పినా ఆయనకు ఆయనే సాటి. అలాంటి గొప్ప నటుడు 31న 79వ వసంతంలోకి అడుగుపెడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన తనయుడు సూపర్ స్టార్ మహేశ్ బాబు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. 'పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్నా..! మీలాంటి వారు నిజంగా ఎవరూ ఉండరు. రాబోయే రోజుల్లో మీరు ఇంకా సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నా. లవ్ యూ..' అని మహేశ్ ట్వీట్ చేశారు.



## వరుస చిత్రాలతో బిజీగా చిరు



### వాల్తేరు వీరయ్యలో విలన్‌గా విజయ్ సేతుపతి


చిరంజీవి ప్రస్తుతం వరుసగా సినిమాలను చేస్తూ యువ హీరోలకు పోటీనిస్తున్నాడు. అప్పట్లో చిరంజీవికి ఎంత బిజీ షెడ్యూల్ ఉందో, ఇప్పుడు కూడా అంతే ఉంది. ప్రస్తుతం ఈయన చేతిలో నాలుగు సినిమాలున్నాయి. ఇటీవలే చిరు 'ఆచార్య'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ చిత్రం ప్రేక్షకులనే కాదు మెగా అభిమానులను కూడా తీవ్రంగా నిరాశపరిచింది. ఈ క్రమంలో చిరు తన తదుపరి చిత్రాలపై పూర్తి దృష్టిని పెట్టాడు. ప్రస్తుతం చిరు రెండు సినిమా షూటింగ్‌లను ఏకకాలంలో జరుపుతున్నాడు. అందులో బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ఒకటి. ఈ చిత్రానికి వాల్తేరు వీరయ్య అనే టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు బాబీ అధికారికంగా ప్రకటించాడు. కాగా ఈ చిత్రంలో విలన్ పాత్ర కోసం ప్రముఖ స్టార్ హీరో ఎంపికైనట్లు సమాచారం. యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ చిత్రంలో విలన్‌గా తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి నటించనున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో సమాచారం. ఇది వరకే మేకర్స్ విజయ్ సేతుపతిని సంప్రదించగా, పాత్ర నచ్చడంతో తన కూడా వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని టాక్. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి పాత్ర ఇంటర్వెల్‌లో రివీల్ కానుందట. దీనిపై త్వరలోనే అధికారికంగా ప్రకటన రానుంది. 'ఉప్పెన' సినిమాలో విజయ్ పండించిన విలనిజంకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇక చిరు సినిమాలో విలన్ అంటే ఎలా నటిస్తాడో అని ప్రేక్షకులలో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో చిరు అండర్‌కవర్ కాప్‌గా కనిపించనున్నాడు. విశాఖపట్నం నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తుంది. మాస్‌రాజ రవితేజ కీలకపాత్రలో నటిస్తున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం మెగాస్టార్‌కు 154వ సినిమాగా తెరకెక్కుతుంది.

## విశాఖలో బ్రహ్మాస్త్ర మూవీ ప్రమోషన్

### రణ్‌బీర్‌తో పాటు ఆయాన్ ముఖర్జీ,రాజమౌళి రాక

బాలీవుడ్ హీరో రణ్ బీర్ కపూర్ మంగళవారం ఉదయం విశాఖపట్నానికి చేరుకున్నారు. సెప్టెంబరు 9న విడుదలకానున్న 'బ్రహ్మాస్త్ర' సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన నగరానికి వచ్చారు. ఈ ఈవెంట్ లో రణ్ బీర్ తో పాటు 'బ్రహ్మాస్త్ర' దర్శకుడు అయాన్ ముఖర్జీ, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి కూడా పాల్గొననున్నారు. అంతకంటే ముందు.. వీరు ముగ్గురు కలిసి సింహాచలం ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇక విశాఖపట్నం విమానాశ్రయంలో దిగిన రణ్ బీర్ కుర్తా, పైజామా, సన్ గ్లాసెస్, ట్యాన్ బ్రౌన్ జూతీస్ లతో హ్యాండ్సమ్ లుక్ లో కనిపించారు. ఆయనకు అభిమానులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపించారు. వాస్తవానికి 'బ్రహ్మాస్త్ర' సినిమా 2019 ఆగస్టు 15నే విడుదల కావాల్సి ఉంది. అయితే దాన్ని తొలుత 2019 క్రిస్మస్ నాటికి, ఆ తర్వాత 2020 వేసవి నాటికి వాయిదా వేశారు. కరోనా సంక్షోభ పరిస్థితుల కారణంగా సినిమా విడుదల మరోసారి నిరవధికంగా వాయిదా పడింది. ఇప్పుడు దాని విడుదల ముహూర్తాన్ని 2022 సెప్టెంబరు 9న ఫిక్స్ చేశారు. రిలీజ్ కు మరో నాలుగు నెలలే సమయం ఉన్నందున మూవీ ప్రమోషన్ ఈవెంట్లను విస్తృతంగా నిర్వహిస్తున్నారు.



## విక్రమ్‌లో రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్‌గా కమల్

ఇండియాస్ మోస్ట్ యాంటిసిపేటెడ్ మూవీస్‌లో 'విక్రమ్' ఒకటి. విశ్వనటుడు కమల్ హాసన్ హీరోగా నటించిన ఈ చిత్రానికి లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించాడు. భారీ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో విజయ్ సేతుపతి, ఫాహద్ ఫాజిల్ వంటి స్టార్ హీరోలు నటించడంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం జూన్ 3న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ క్రమంలో చిత్రబృందం ప్రమోషన్లను జోరుగా జరుపుతుంది. ప్రమోషన్లలో భాగంగా మేకర్స్ పలు విషయాలను వెల్లడిస్తూ ప్రేక్షకులలో ఆసక్తిని క్రియేట్ చేస్తున్నారు. తాజాగా లోకేష్ కనగరాజ్ చిత్రం గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించాడు. కమల్ ఈ చిత్రంలో రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నట్లు తెలిపాడు. ఈ చిత్రం కూడా ఖైదీ తరహాలోనే ఒక రాత్రి జరిగే కథ అని తెలిపాడు. దాంతో ఈ చిత్రంపై ప్రేక్షకులలో తీవ్ర ఆసక్తి నెలకొంది. సూర్య గెస్ట్ రోల్‌లో కనిపించనున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించాడు. రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఆర్. మహేంద్రన్‌తో కలిసి కమల్ స్వీయ నిర్మాణంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com